ఎమ్మెల్యే బూచేపల్లి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ



బూచేపల్లిని సత్కరిస్తున్న సర్పంచ్ కోటా శివలక్ష్మి

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడులో పోలేరమ్మ కొలుపులు జరుగుతున్నాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో వారం రోజుల నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొలుపులకు హాజరు కావాలని సర్పంచ్ కోటా శివలక్ష్మీ వెంకట రామిరెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం హాజరై పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం మండల నాయకులతో కలిసి దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి గజమాలతో ఘన నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ ఆహ్వానం మేరకు తేనేటి విందుకు హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

క్లుప్తంగా

కంది విత్తనాలు పంపిణీ



కంది విత్తనాలతో గ్రామ రైతులు

దొనకొండ: మండలంలోని పెద్దన్నపాలెం రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాల పథకం కింద 35 ఎకరాల్లో ఎల్ఆర్‌జీ 52 కంది రకం విత్తనాలు, 13:0:45 రకం నీటిలో కరుగు ఎరువులు, పురుగు మందులు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ 52 కంది రకం పంట కాలం 160–170 రోజుల్లో ఎకరాకు 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఎండు తెగులును కొంతవరకు తట్టుకుంటుందని చెప్పారు. కంది పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

చదువులో ముందుండాలి



విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: విద్యార్థులు చదువుల్లో ముందంజలో ఉండాలని ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి అన్నారు. స్థానిక శివరాజ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో చదవటం నా కిష్టం కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో ఒకటో తరగతి విద్యార్థులకు సోమవారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలక, నోట్ బుక్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘురామయ్య, రమాదేవి మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా టైం కేటాయించి వెనుకబడిన పిల్లలు రాణించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయులు మరియమ్మ, ఖాదర్ వలి, బీబీ జాన్, సుజాత, రామారావు, ఆదిలక్ష్మి, రోశయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశం జయప్రదం చేయాలి

కురిచేడు: మండల స్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య కోరారు. బుధవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం దర్శిరోడ్‌లోని గుంటక నాసర్ రెడ్డి కళ్యాణ మంటపంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న వాకా జనార్దన్‌రెడ్డి

ముండ్లమూరు (దర్శి): ఉపాధ్యాయులకు రావాల్సిన జూన్, జూలై జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఆ కార్యాలయంలో సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగి రెండు నెలలైనా నేటివరకు జీతాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. కొత్తగా మంజూరైన పోస్టులకు పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయుల జీతాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీ–4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు బలవంతంగా రుద్దుతున్నారని మండిపడ్డారు. యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాలు పడిపోకుండా చూడాలని, 2025లో బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, మూడేళ్లుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని, 2025 డీఎస్సీకి నూతన పోస్టులను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లేవి ప్రసాద్, జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్‌కే మస్తాన్, సీహెచ్ పద్మావతి, ముండ్లమూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ఎలీషా, దర్శి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు, కురిచేడు ప్రధాన కార్యదర్శి ఖాజా రహంతుల్లా పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై దృష్టి సారించండి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఖాసిం అన్నారు. సోమవారం మండలంలోని కోమరోలు ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత రికార్డులు, విద్యార్థులకు అందజేసిన కిట్ల వివరాలు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నోట్‌పుస్తకాలను తనిఖీ చేసి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రాయడం, చదవడం నేర్పించి వారిలో సామర్థ్యాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో కూడా విద్యార్థులకు రుచికర నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను నవోదయకు దరఖాస్తు చేయించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామంలో పాఠశాల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని చెప్పారు.

నేడు బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సమావేశం

దొనకొండ: మండల కేంద్రంలోని దొనకొండ ఎస్ఆర్ పెట్రోల్ బంకు ఎదుట ఖాళీ స్థలంలో మంగళవారం ఉదయం 10 గంటలకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పేరుతో నిర్వహిస్తున్న సభకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, బూచేపల్లి అభిమానులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగ సభ్యులు భారీగా తరలి రావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారని కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి హామీ వేతనాలు ఇవ్వండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

● కేంద్ర బృందానికి ప్రజల వినతి

ముండ్లమూరు(దర్శి): 150 రోజుల పని దినాలు కల్పించి, నెలల తరబడి ఆగి ఉన్న ఉపాధి హామీ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎన్ఎల్ఎం కేంద్ర బృందం సభ్యులు ప్రభాత్ శర్మ, నందలాల్ గుర్జాల్‌లకు ప్రజలు విన్నవించారు. ముండ్లమూరు మండలం మారెళ్ల పంచాయతీలో నేషనల్ లెవెల్ మోనిటరింగ్ టీమ్ కేంద్ర ప్రభుత్వం నిధులతో కొనసాగుతున్న పథకాల కార్యక్రమాల అమలును పరిశీలించారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడి పథకం అమలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనాలు కొన్ని నెల నుంచి ఖాతాల్లో పడటం లేదని చెప్పారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పోస్ట్ ఆఫీస్‌లో వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని పోస్టుమాస్టర్ శ్రీను మహిళలు, వృద్ధులను ఒకటికి పదిసార్లు పోస్టాఫీస్ చుట్టూ తిప్పించుకుంటున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చేపట్టిన రైతు వారి గుంట పనులు, కాటిల్ షెడ్, పశువుల నీటి తొట్లు, వాటర్ హార్వెస్టింగ్ పాండ్‌ల పనులు, పంచాయతీరాజ్ ద్వారా చేపట్టిన ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనలో నూజిల్లపల్లి నుంచి పూరిమెట్ల వరకు ఏర్పాటు చేసిన రోడ్లను పరిశీలించారు. వెలుగు కార్యాలయానికి సంబంధించి గ్రూపుల లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలోని కెనరా బ్యాంకును సందర్శించారు. సామాజిక భద్రత పెన్షన్ లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్ లబ్ధిదారులతో వారి సమస్యలు చర్చించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ లక్ష్మీరెడ్డి , ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ బసవ సుబ్బారావు, ఎంపీడీఓ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సుబ్బారావు, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏపీఓ వెంకట్రావు, ఈసీ శివరామకృష్ణ వెలుగు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.